క్లుప్తంగా

మానవత్వం చూపిన కలెక్టర్, జేసీ

అర్జీ ఇచ్చిన వెంటనే సమస్య పరిష్కారం



చిలకలపూడి(మచిలీపట్నం): ఓ వృద్ధునిపై కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ మానవత్వం చూపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నగరంలోని చిలకలపూడికి చెందిన వంగా జోగారావు తనకు 75 ఏళ్లని సరిగా నడవలేక, వినపడక ఇబ్బందులు పడుతున్నానని, వినికిడి యంత్రం, మూడు చక్రాల సైకిల్ ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ వెంటనే స్పందించి వికలాంగుల సంక్షేమశాఖ ఏడీని పిలిచి ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంటనే జోగారావుకు వినికిడి యంత్రాన్ని కలెక్టర్ రాజాబాబు, జేసీ అపరాజితసింగ్ చేతుల మీదుగా అందించారు. మూడు చక్రాల ట్రైసైకిల్‌ను రెండు రోజుల్లో అందిస్తామని కలెక్టర్ చెప్పారు. దీంతో వృద్ధుడు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ బి.రామకుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

కోడూరు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసి, జీవన విధానంలో అనుసరించాల్సిన మార్పులపై అవగాహన కలిగి ఉండాలని మచిలీపట్నం ఫారెస్ట్ రేంజర్ సుజాత అన్నారు. పాలకాయతిప్ప గ్రామంలో సోమవారం లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (లైఫ్) అనే కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, నీటిని వృథా చేయరాదని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడంతో పాటు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించేందుకు విషపదార్థాల వినియోగాన్ని అరికట్టాలని సుజాత కోరారు. అనంతరం గ్రామంలోని మత్స్యకారులకు అటవీ నిబంధనలను వివరించారు. అవనిగడ్డ ఫారెస్ట్ రేంజర్ కేవీఎస్ రాఘవరావు, ఏఎస్ఐ జి.పోతురాజు, పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు పాల్గొన్నారు.

కొత్త వాషింగ్‌మిషన్ ఇవ్వాలని ఆదేశం

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలోని ఒక ఎలక్ట్రానిక్స్ షాపులో కొనుగోలు చేసిన వాషింగ్ మిషన్ పనిచేయకపోవటంతో వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడికి కొత్త వాషింగ్ మిషన్ ఇవ్వాలంటూ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల సోమవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నం నగరానికి చెందిన ఎండీ జఫ్రుల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా, కమిషన్ సభ్యులు రూ.18,500 కలిగిన కొత్త వాషింగ్ మిషన్‌ను ఇవ్వాలని, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.10 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఇవ్వాల్సిందిగా వంశీ ఎలక్ట్రానిక్స్, గోద్రేజ్ కంపెనీని ఆదేశిస్తూ తీర్పులో పేర్కొన్నారు.

చంద్రబాబు చెప్పేవన్నీ కల్పితాలే

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- అవనిగడ్డ నుంచి లక్ష్మీపురం వరకూ 16 కి.మీ బైక్ ర్యాలీ

అవనిగడ్డ: చంద్రబాబు చెప్పేవన్నీ కల్పితాలేనని, ఆయన మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం అవనిగడ్డ నుంచి చల్లపల్లి మండలం లక్ష్మీపురం వరకు 16 కి.మీ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అవనిగడ్డ వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ తుంగల సుమతీదేవి ఈ బైక్ ర్యాలీని ప్రారంభించారు. స్థానిక వంతెన సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే సింహాద్రి, ఏపీ రైతువిభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో రెండేళ్లు కరోనా కష్టకాలం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేయూత అందించారని చెప్పారు. చంద్రబాబుకు పేదలపై చిత్తశుద్ధి ఉంటే 14 ఏళ్ల పాలనలో ఇన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు ఎందుకు అందించలేదని ఎమ్మెల్యే సింహాద్రి ప్రశ్నించారు. నోటికొచ్చిన తాయిలాలు చెబుతూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి, పేదల కోసం పనిచేస్తున్న వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జనమంతా జగన్‌మోహన్‌రెడ్డిని నమ్ముతున్నారని రాబోయే ఎన్నికల్లో మళ్లీ కచ్చితంగా వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి, అవనిగడ్డ, కోడూరు జెడ్పీటీసీ సభ్యులు చింతలపూడి లక్ష్మీనారాయణ, యాదవరెడ్డి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ, నాగాయలంక, ఘంటసాల మండల కన్వీనర్లు రేపల్లె శ్రీనివాసరావు, భోగాది వెంకట శేషగిరిరావు, వేమూరి వెంకట్రావ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు

చంద్రబాబు టీజర్ సినిమాలో కనిపించదు

చల్లపల్లి: మహానాడులో చంద్రబాబు నాలుగు హామీలిచ్చి టీజర్ అదిరిందా అనటం సిగ్గుచేటు అని, చంద్రబాబు చూపించిన టీజర్ సినిమాలో కనిపించదని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలు అటకెక్కించటం, మేనిఫెస్టో మాయం చేయటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ఆధ్వర్యంలో చేపట్టిన భారీ బైక్ ర్యాలీ చల్లపల్లి, రామానగరం, లక్ష్మీపురం వరకు సాగింది. స్థానిక ఒకటో వార్డులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే రమేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా అమలు చేసి చూపించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు సంపూర్ణ మద్దతుగా ఉన్నారని, చంద్రబాబు ఇలాంటి ఎన్ని మోసపూరిత హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మేది లేదన్నారు. వందలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోపిదేవిలో...

మోపిదేవి: నాలుగేళ్ల కిందట రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నాలుగేళ్లలో ప్రజల జీవితాల్లో పెనుమార్పులు తీసుకువచ్చారని అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ఆధ్వర్యంలో అవనిగడ్డ నుంచి లక్ష్మీపురం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మోపిదేవి ప్రధాన గుడి సెంటర్‌లో జగనన్న జిందాబాద్, జోహార్ వైఎస్సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ ముందుకు సాగింది. పెదప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు ఆధ్వర్యంలో 70 ద్విచక్ర వాహనాల్లో సుమారు 100 మందికి పైగా యువకులు కేరింతలు కొడుతూ ర్యాలీలో పాల్గొన్నారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యంలో పాల్గొని ఎమ్మెల్యే సింహాద్రికి సంఘీభావం తెలుపుతూ భారీ ర్యాలీలో పాల్గొన్నారు.



మోపిదేవిలో ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

గతంలో పింఛన్ల కోసం పడిగాపులు పడేవాళ్లం

గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజల స్పందన

చిలకలపూడి(మచిలీపట్నం): గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు తీసుకునేందుకు ఉదయం వెళ్లి పడిగాపులు పడేవాళ్లమని పలువురు గ్రామస్తులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)కు వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండల పరిధిలోని తుమ్మలపాలెం, వాడగొయ్యి గ్రామంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు పేర్ని కిట్టుతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తెల్లవారుజామునే తలుపు కొట్టి వలంటీర్ల ద్వారా పింఛన్లను ఇంటి వద్దకే తెచ్చిస్తున్నారని, ఇందుకు సీఎం జగన్‌కు తామంతా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి దేవానందం, తుమ్మల చెరువు ఇన్‌చార్జ్ లక్ష్మణ్, తుమ్మలచెరువు వైఎస్సార్ సీపీ నాయకుడు తలారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివాలయానికి మంత్రి జోగి రమేష్ శంకుస్థాపన

కృత్తివెన్ను: మండల పరిధిలోని చెరుకుమిల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ అన్నపూర్ణాదేవీ సమేత ఓంకారేశ్వరస్వామివారి ఆలయ నిర్మాణ శంకుస్థాపనలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని నవధాన్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరం

మంగళాపురం(చల్లపల్లి): ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వరంగా నిలుస్తుందని మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు తెలిపారు. గ్రామ సచివాలయ ప్రాంగణంలోని జగనన్న విలేజ్ క్లినిక్‌లో సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ కేవీ పద్మావతి రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. అనారోగ్యంతో ఇంటికి పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు వేళాయె!

- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన శ్రీవారి ఆలయం

కోడూరు: దివిసీమలో ప్రసిద్ధిగాంచిన కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలను బుధవారం నుంచి ప్రారంభించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. 31న ఉదయం 10 గంటలకు స్వామివార్లకు అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ సోమవారం చెప్పారు. సాయంత్రం 5 గంటలకు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టి, రాత్రికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, సంతానం కోరే మహిళలకు గరుడ ప్రసాదం అందించనున్నట్లు ధర్మకర్త చెప్పారు. జూన్ 1న ఉదయం హోమాలు, శత కలశ క్షీరాభిషేకం, రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఎదురు కోలోత్సవం, 2న ఉదయం కౌతుకోత్సవము, నవకలశ స్నపన, రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న గరుడ, శేషవాహనాలపై స్వామివారి తిరువీధి ఉత్సవం, 4న అవభృద స్నానం, మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణ, 5న శాంతి కల్యాణం, శ్రీపుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవతో ఉత్సవాలను ముగించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 6న శ్రీవారి మహా అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పద్మావతి వరప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

క్రికెట్ పోటీల్లో విజేత మోపిదేవి జట్టు

మోపిదేవి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల స్థాయిలో మలిశెట్టి శ్రీనివాసరావు, కారుమూరి శివనాగరాజు ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీపాఠశాల ఆవరణలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో మోపిదేవి జట్టు ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన మోపిదేవి జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన మచిలీపట్నం సీఎస్‌కే చిట్టిపాలెం జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 110 పరుగులు మాత్రమే చేయగలిగింది. విజేత మోపిదేవి జట్టుకు రూ.50 వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. రన్నర్‌గా నిలిచిన చిట్టిపాలెం జట్టుకు రూ.25 వేలు నగదు, ట్రోఫీని అందించారు. మోపిదేవి జట్టులో 14 పరుగులు చేసి మూడు వికెట్లు తీసిన కృష్ణకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. రంగిశెట్టి శ్రీనివాసరావు, పెద్ది నాగబాబు, యడ్ల ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు

చిలకలపూడి(మచిలీపట్నం): గామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇంటి వద్దనే వైద్యసేవలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని 104 మచిలీపట్నం డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ కె.శ్రీనివాసపెరుమాళ్లు అన్నారు. బందరు మండలం తాళ్లపాలెం గ్రామంలో 104 వాహనం ద్వారా సోమవారం సంచార వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రిక, ఏఎన్ఎం సుధారాణి, 104 డీఈవో భరత్‌బాబు, కె.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

మోపిదేవి/మచిలీపట్నంటౌన్: మోపిదేవి దళితవాడలో ఇటీవల మృతి చెందిన కొప్పుల కుమారి భర్త వెంకటేశ్వరావుకు వైఎస్సార్ బీమా కింద గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి సోమవారం రూ.10 వేలు అందజేశారు. మచిలీపట్నం 31వ డివిజన్‌లో ఇటీవల మృతి చెందిన దోవారి యేసమ్మ భర్త ఫ్రాన్సిస్‌కు వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలను కార్పొరేటర్ యంత్రపాటి నాగేశ్వరరావు అందజేశారు.



తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

పెడన: పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరాకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నారాణి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ హాలులో సోమవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన తాగునీటి సమస్యకు చైర్‌పర్సన్ బదులిస్తూ ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్యాంకర్ల ద్వారా ప్రతి వార్డుకు తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. నీరు అందని ప్రాంతాలకు ఫోన్ ద్వారా ఎవరు ఫిర్యాదు చేసినా తక్షణం ట్యాంకర్లను పంపుతున్నట్లు చెప్పారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ఎం డి.ఖాజా, బి.జ్యోతి, ఫ్లోర్‌లీడర్ కె.ప్రసాదు, కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు చేయూత

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ పథకం ద్వారా సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సోమవారం సాయంత్రం సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల పురోభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యల గురించి కమిటీ సభ్యులతో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు గరిష్ఠంగా కోటి రూపాయల వరకు రుణం, ప్రాజెక్టు వ్యయంలో 30 శాతం వరకు రాయితీ ఇస్తారన్నారు. ప్రాజెక్టు వ్యయంలో 10 శాతం బెనిఫిషరీ పెట్టుబడి పెట్టాలన్నారు. ప్రస్తుతం వ్యాపారంలో కొనసాగుతున్న అన్ని సూక్ష్మ పరిశ్రమల వారు దీనికి అర్హులన్నారు. ఔత్సాహికులైన యువతీ, యువకులు, డ్వాక్రా మహిళలు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సమావేశంలో ఏపీఎఫ్‌పీఎస్ ఈడీ మహాలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయభారతి పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నజరానాకు సన్మానం

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన నజరానాను ముస్లిం ఐక్యవేదిక ప్రతినిధులు సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఈడేపల్లిలోని ముస్లిం ఐక్యవేదిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, హ్యూమన్ రైట్స్ చైర్మన్ రాజులపాటి శివప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు పఠాన్ కరీముల్లా ఖాన్, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర నాయకుడు రియాజ్ హుస్సేన్, ముస్లిం ఐక్య వేదిక సభ్యుడు షేక్ మౌలాలి పాల్గొన్నారు.

ఆలయానికి హుండీ బహూకరణ

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠోత్సవం జరిగిన శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి ఇదే గ్రామానికి చెందిన కొప్పుల వెంకటేశ్వరరావు, బేబి సరోజిని దంపతులు సోమవారం కానుకల హుండీ బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీహరి ఆధ్వర్యంలో తొలుత విశ్వేశ్వరునికి అభిషేకాలు, అన్నపూర్ణాదేవికి విశేష పూజలు జరిపారు. అనంతరం రూ.6 వేలు విలువైన స్టీలు హుండీని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులకు దాత అందజేశారు. ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

